సాక్షి
కర్నూలు
బుధవారం । 10 । జూలై । 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద వితరణ పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కె.వినోద్‌కుమార్ దంపతులు రూ.లక్ష విరాళమిచ్చారు.



అలరించిన సంకీర్తన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ నిత్యక ళావేదికపై మంగళవారం తూర్పుగోదావరికి చెందిన ఎల్.శ్రీనివాస్ బృందం వారి శివనామ సంకీర్తన పలువురు భక్తులను అలరించింది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి తక్కువ ధరకే బియ్యం, బ్యాళ్లు

- రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ
- జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రైతు బజార్లలో తక్కువ ధరకే బియ్యం, బ్యాళ్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సివిల్ సప్లై, రైతు బజార్ల అధికారులు, సూపర్‌మార్కెట్ల ప్రతినిధులు, హోల్‌సేల్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి అంగీకారంతో తగ్గిన బియ్యం, బ్యాళ్ల ధరలు 11వ తేదీ నుంచి రైతు బజార్లలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుతం బ్యాళ్లు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.181 ఉందని, రైతుబజార్‌లో రూ.160లకే ఇవ్వనున్నట్లు చెప్పారు. సోనమసూరి బియ్యం(స్టీమ్‌డ్ రైస్) బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.55.85 ఉండగా రూ.49లకు, సోనమసూరి బియ్యం(రా రైస్) బహిరంగ మార్కెట్‌లో రూ.52.40 ఉండగా రూ.48లకే కేజీ ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కాగా, తగ్గిన బియ్యం, బ్యాళ్లను కొనుగోలు చేసేందుకు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ ప్రసాదు, డీఎం షర్మిళ, ఏఎస్‌ఓ రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

20న చేపలు పట్టేందుకు వేలంపాట

కర్నూలు(అగ్రికల్చర్): పత్తికొండ మండలం పందికోన-పులికొండ గ్రామాల పరిధిలోని పందికోన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోని మత్స్యసంపదను ఈనెల నుంచి వచ్చే ఏడాది(2025) జూన్ 30 వరకు(1443 ఫసలి) లీజుకు ఇచ్చేందుకు 20వ తేదీన పత్తికొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.10 వేలు డిపాజిట్ చేసి ఆధార్ కార్డు సమర్పించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. లీజుదారుడికి రిజర్వాయర్‌లోని మత్స్య సంపదపై మాత్రమే అధికారం ఉంటుందని, నీటిపై ఎలాంటి అధికారం ఉండదని తెలిపారు. చేపలు పట్టేటప్పుడు తూముల నుంచి గానీ, చెరువు కట్టకు గండ్లు పెట్టి గానీ, నీరు తొలగించి కానీ చేపలు పట్టరాదన్నారు.



ఇసుక తరలింపునకు రీచ్ వద్ద బారులు తీరిన టిప్పర్లు

కళ్లల్లో 'ఇసుక'

ఉచితం కాదు కొనాల్సిందే!

- టన్ను రూ.335 చొప్పున విక్రయిస్తోన్న చంద్రబాబు సర్కార్
- పేరుకు మాత్రమే ఉచితమంటూ ప్రచారం
- టిప్పర్ ఇసుకకు రూ.6,030, ట్రాక్టర్‌కు రూ.1,340 వసూలు
- కర్నూలు, నంద్యాల జిల్లాలకు గుడికంబాలి రీచ్ మాత్రమే దిక్కు
- ప్రారంభం కాని సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదెన్ని, కె.సింగవరం రీచ్‌లు
- ఇసుక రవాణా చార్జీలను 10 శాతం పెంచే ఆలోచనలో వాహన యజమానులు



గుడికంబాళి రీచ్‌లో ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్)/కౌతాళం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చెబుతున్నట్లు ఇసుక ఉచితంగా లభించడం లేదు. డబ్బులు పెట్టి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిందే. కర్నూలు జిల్లాలో గుర్తించిన ఏకైక ఇసుక రీచ్ కౌతాళం మండలం గుడికంబాళిలో టన్ను ఇసుకను అధికారులు దగ్గరుండి రూ.335 ప్రకారం విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక(4 టన్నులు)కు రూ.1340, టిప్పర్ ఇసుక (18టన్నులు)కు రూ.6,030 చెల్లించి వినియోగదారులు తమ ఇళ్లు, ఇతర నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక అంటూ ప్రభు త్వం మభ్యపెడుతుండడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

గుడికంబాళిలో ప్రారంభమైన ఇసుక సరఫరా

కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన భవన నిర్మాణదారులకు మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం మండలం గుడికంబాళిలో మాత్రమే రీచ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ దాదాపు 29వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. సోమవారం నుంచి ఇసుక సరఫరా ప్రారంభమైంది. మొదటి రోజు కేవలం రెండు టిప్పర్లను మాత్రమే తరలించారు. రెండో రోజు మంగళవారం దాదాపు 71 టిప్పర్లు, 30 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అవసరం ఉన్న వారు తరలించుకుపోయారు. టన్ను ఇసుక రూ.335 ప్రకారం చెల్లించి తీసుకెళ్లారు. టిప్పర్‌లో 18 టన్నుల ఇసుక పడుతుండడంతో రూ.6,030, ట్రాక్టర్‌లో 4 టన్నుల ఇసుకను తరలించేందుకు అనువుగా ఉండడంతో రూ.1,340 చెల్లిస్తున్నారు. కాగా, వారం రోజుల్లో గుడికంబాళిలో ఉన్న ఇసుక నిల్వలు తరిగిపోనున్నాయి. సెప్టెంబర్ వరకు ఇక్కడ ఇసుకను తీయడానికి అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఇసుక కొరతను అధిగమించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

పర్యావరణ అనుమతుల కోసం డిసిల్టింగ్ పాయింట్ల వివరాలు

జిల్లాలో గుడికంబాళితో పాటు సి.బెళగల్ మండలం కొత్తకోట, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదెన్ని, కె.సింగవరం సమీపాల్లో డిసిల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే వీటికి పర్యావరణ అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ అనుమతులు వచ్చే వరకు ఆయా పాయింట్లలో ఇసుక తీయడానికి వీలుండదు.

రూ.32వేలు చెల్లించాల్సిందే!

కర్నూలు నుంచి గుడికంబాళి 131 కి.మీ దూరంలో ఉంది. టిప్పర్ ఇసుక కోసం అక్కడికి వెళ్తే రవాణా చార్జీలు దాదాపు రూ.26 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఇసుక ధర రూ. 6,030 అదనం. ఈ నేపథ్యంలో కర్నూలు వాసులు టిప్పర్ ఇసుక తెచ్చుకోవాలంటే రూ.32 వేలు చెల్లించక తప్పని పరిస్థితి. మరి ఉచిత ఇసుక హామీ ఎక్కడ అమలవుతుందో 'కూటమి'కెరుక.

రవాణా భారం తడిసి మోపెడు..

- ప్రస్తుతం గుడికంబాళిలో మాత్రమే ఇసుక లభిస్తుండడంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని నియోజవకర్గాలకు చెందిన భవన నిర్మాణదారులు అక్కడికి వెళ్లాల్సిందే.
- ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కూడా టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.20 వేల ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలకు చెందిన భవన నిర్మాణదారులకు రవాణా చార్జీలతో కలుపుకొని టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.35 వేల వరకు ఖర్చు వస్తుంది.
- నంద్యాల, బనగానిపల్లె, ఆళ్లగడ్డ, డోన్, పాణ్యం నియోజకవర్గాలకు చెందిన వారు టిప్పర్ ఇసుక కోసం దాదాపు రూ.35 నుంచి రూ.40 వేల వరకు చెల్లించాల్సిందే.
- ఆళ్లగడ్డ, డోన్, బనగానిపల్లె, పాణ్యం నియోజకవర్గాలకు చెందిన వారు కడప జిల్లా చెన్నూరు, అనంతపురం జిల్లా పామిడిలలో ఏర్పాటు చేసిన రీచ్‌లకు వెళ్లినా అంతేస్థాయిలో డబ్బు ఖర్చు చేయాక తప్పని పరిస్థితి.
- ఇదిలాఉంటే ఇసుక రవాణా చార్జీలను 10 శాతం పైగా పెంచే యోచనలో వాహన యజమానులు ఉన్నట్లు సమాచారం.

టిప్పర్ ఇసుకకు రూ.6,030



ఉచిత ఇసుక కోసం వచ్చాం. అయితే ఇక్కడ టిప్పర్ ఇసుకకు రూ. 6,030 కట్టించుకున్నారు. ముందుగా డబ్బు కడితేనే ఇసుకను లోడింగ్ చేస్తారు. టన్నుకు రూ.335 ప్రకారం వసూలు చేస్తున్నట్లు ఇక్కడి అధికారులు చెబుతున్నారు. ఇదెక్కడి ఉచిత ఇసుకనో అర్థం కావడం లేదు.

– శ్రీనివాసరెడ్డి, ఎమ్మిగనూరు

భారంగా రవాణా చార్జీలు



నేను ఆదోని నుంచి వచ్చా. రెండు టిప్పర్లకు రూ. 12,060 చెల్లించాను. ఇసుక తీసుకెళ్లడానికి టిప్పర్ బాడుగ, డ్రైవర్ బత్తా, ఇతర ఖర్చుల కింద రూ.9 వేలు చెల్లించాను. మొత్తంగా 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదోనికి టిప్పర్ ఇసుక కోసం రూ.15,060 చెల్లించాల్సి వస్తోంది. ఇది ఉచిత ఇసుక అయితే కాదు.

– మల్లికార్జున, ఆదోని

రవాణాకే అధిక ఖర్చు



ఉచిత ఇసుక అని చెప్పి ప్రజలను కూటమి ప్రభుత్వం వంచన చేసింది. రవాణాతో ప్రజలపై పెనుభారం మోపుతుంది. మంత్రాయలం వద్ద ఉన్న గుడి కంబాళి ఇసుక రీచ్ పాయింట్ నుంచి నంద్యాలకు చేరాలంటే 200 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంది. రవాణాకే అధిక ఖర్చు చేయాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో ఇసుక అందుబాటులో ఉండేది.

– నాగరాజు, ఎస్బీఐ కాలనీ, నంద్యాల

పేరుకే ఉచిత ఇసుక

గతంలో ఇసుక కేవలం నంద్యాలలోనే రూ.1,190లకు అందరికీ అందుబాటులో ఉండేది. ఇప్పుడు నంద్యాల ప్రజలు గుడికంబాళి, వైఎస్సార్ జిల్లా ఆర్ఎస్.పొన్నాపురం రీచ్‌ను ఆశ్రయించాల్సిందే. ఆధార్ అనుసంధానంతో ఇసుక తీసుకున్న వ్యక్తికి మరో 5 రోజుల పాటు ఇసుక పొందే అవకాశం లేదు. వందల కిలోమీటర్ల మేర ప్రయాణానికి డీజిల్, వాహనాల బాడుగలు అధికంగా అయ్యే పరిస్థితి ఉంది.

– మధు, నంద్యాల

ఓర్వకల్లు నుంచి విజయవాడకు విమాన సర్వీసులు

- మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు



బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి టీ.జీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, తదితరులు

కర్నూలు సిటీ: ఓర్వకల్లు విమానశ్రయం నుంచి త్వరలోనే విజయవాడకు ప్రత్యేక విమాన సర్వీసులు నడిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం ఏపీ ప్రజా రవాణా సంస్థ కర్నూలు-1, కర్నూలు-2 డిపోలలో ఆరు కొత్త బస్సులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీ మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్లలో రాయలసీమ జిల్లాల్లోనే కర్నూలు బస్టాండ్ అతి పెద్దదన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి ఆర్టీసీ అధికారులతో సమావేశమై చర్చిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి విజయవాడకు రెగ్యులర్‌గా విమాన సర్వీసులు నడపాలని, రాత్రి వేళల్లో కూడా విమానాలు వచ్చేందుకు కావాల్సిన సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. కర్నూలు-1 డిపో నుంచి రెండు స్టార్ లైనర్ బస్సులు బెంగళూరు రూట్‌కు, మరో రెండు సూపర్ లగ్జరీ బస్సులు సైతం బెంగళూరు రూట్‌కు, కర్నూలు-2 డిపో నుంచి రెండు లగ్జరీ బస్సులను తిరుపతి రూట్‌లో తిప్పనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి టి.శ్రీనివాసులు మంత్రి, ఎంపీలకు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు-1 డిపో మేనేజర్ సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



పెద్దపాడు వసతి గృహంలో ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కల్లూరు: బాగా చదువుకుని మంచి మార్కులతో పాస్ అయి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దపాడు గ్రామంలో ఉన్న దామోదరం సంజీవయ్య స్మారక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు కాస్మొటిక్, మెస్ చార్జీలు రెగ్యులర్‌గా చెల్లిస్తున్నారా అని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవిని అడిగి తెలుసుకున్నారు. వసతి గదులు, మరుగుదొడ్లనను తనిఖీ చేసి తలుపులకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. స్టోర్ రూం, బియ్యం, రాగుల నాణ్యతతో పాటు ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. భోజనం సరిపోతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని బాగా చదువుకుని అధిక మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి కలలు నిజం చేసేలా ఇష్టపడి చదవాలన్నారు. 8వ తరగతి విద్యార్థి వినయ్‌కుమార్‌కు కలెక్టర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి చేత కేక్ కట్ చేయించారు. అంతకుముందు వసతి గృహంలో ఏర్పాటు చేసి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, వార్డెన్ మల్లికార్జున పాల్గొన్నారు.

పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖలపై కలెక్టర్ సమీక్షించారు. ముందుగా ఏపీఐఐసీకి సంబంధించి 9074.52 ఎకరాల ల్యాండ్ బ్యాంకు ఉందని, ఓర్వకల్లు ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, గుట్టపాడు క్లస్టర్, ఎంఎస్ఎంఈలపై జోనల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ల్యాండ్ బ్యాంకు ఏ ఏ ప్రాంతాల్లో ఎంత విస్తీర్ణంలో ఉంది? ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు వరకు నీటి సరఫరాకు సంబంధించిన పనులు ఏ దశలో ఉన్నాయో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఐఐసీ భూములకు సంబంధించి మార్ట్‌గేజ్ చేసే ప్రక్రియపై రాష్ట్ర స్థాయి నుంచి ఉత్తర్వులు రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని జెడ్ఎంను ఆదేశించారు. అనంతరం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కార్యక్రమాలపై ఆ శాఖ జనరల్ మేనేజర్ మారుతీప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపన కోసం 158దరఖాస్తులు రాగా, 149 దరఖాస్తులను అప్రూవ్ చేయగా 4 దరఖాస్తులు తిరస్కరించినట్లు, 5 దరఖాస్తునలు పెండింగ్‌లో ఉంచినట్లు వివరించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాలపై విస్తృత ప్రచారం కల్పించి అర్హులను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదనరావు, కర్నూలు ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, ఓర్వకల్ తహసీల్దార్ నటరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

- పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపిన కాలనీవాసులు



పాఠశాలకు తాళం వేస్తున్న కాలనీ వాసులు

ఎమ్మిగనూరు రూరల్: ఉపాధ్యాయులను నియమించాలని మండల పరిధిలోని కందనాతి గ్రామ ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి డిపెప్ పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సందిపోగు సోమన్న, బత్తిని నారాయణ, మల్రెడ్డి రాజు, మదిరి వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ ఏడాది నుంచి పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో తమ పిల్లలకు సరైన విద్య అందడం లేదన్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఎంఈఓను సస్పెండ్ చేసి పాఠశాలకు అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తామని కాలనీ వాసులు తెలిపారు.

భ్రామరీకి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఆషాఢమాసం సందర్భంగా శ్రీశైల భ్రమరాంబాదేవికి సారె సమర్పించారు. మంగళవారం శ్రీశైలంలో శివసేవకులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణ దత్తసాయి సేవాసమితి అధ్యక్షురాలు సాహితీరెడ్డి ఆధ్వర్యంలో ఆ సమితి సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి ఆలయంలో సేవ చేసేందుకు వచ్చిన శివసేవకులు మొత్తం 200 మంది భక్తులు భ్రమరాంబాదేవి అమ్మవారికి సారె సమర్పించారు.

అత్యవసర పనులకు రూ.19.28 కోట్లతో అంచనాలు



మాట్లాడుతున్న జల వనరుల శాఖ సీఈ కబీర్‌బాషా

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు, కాలువల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయనున్న ఆయకట్టుకు నీటిని అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరమైన పనులు చేసేందుకు రూ.19.28 కోట్లతో అంచనాలు రూపొందించి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు అందజేసినట్లు ఆ శాఖ ముఖ్య ఇంజనీర్ కబీర్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో నివేదికను సమర్పించామన్నారు. కేసీ కాలువలో రూ.3.17 కోట్లతో 35 పనులకు, తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో రూ.2.38 కోట్లతో 17 పనులు, దామోదరం సంజీవయ్య సాగర్(గాజులదిన్నె ప్రాజెక్టు) పరిధిలోని రూ.89 లక్షలతో 5 పనులు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద రూ.2.32 కోట్లతో 13 పనులకు, శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలోని రూ.79 లక్షలతో నాలుగు పనులకు, తెలుగుగంగ కాల్వ పరిధిలో 42 పనులకు రూ.3.93 కోట్లతోను, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం కింద 12 పనులకు రూ.1.48 కోట్లతోను, శ్రీశైలం కుడి కాలువ సర్కిల్-1, సర్కిల్-2 పరిధిలోని 42 పనులకు రూ.3.56 కోట్లతోను, గాలేరు-నగరి సుజల ప్రవంతి పథకం కింద 8 పనులకు రూ.73 లక్షలతో మొత్తం 178 పనులకు అంచనాలు వేసి సమర్పించామన్నారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

రైతులకు సరైన పరిహారం చెల్లిస్తాం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రాజెక్టు 765 కేవీ కర్నూలు-3 పవర్‌లైన్ల నిమిత్తం సేకరించే భూములకు సరైన పరిహారం చెల్లిస్తామని జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. మంగళవారం ఉదయం ఆమె కాన్ఫరెన్స్ హాలులో ఓర్వకల్లు మండలానికి చెందిన రైతులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ టవర్లు, పవర్‌లైన్ల ఏర్పాటు కోసం రైతుల నుంచి భూములను సేకరిస్తున్నామని, సహృదయంతో సహకరించాలని కోరారు. టవర్ ఏర్పాటుకు 7 సెంట్లు, ఇతర అవసరాల నిమిత్తం అర్ధ ఎకరం సేకరిస్తామని, ఇందుకు తగిన పరిహారం చెల్లించిన తరువాతే స్వాధీనం చేసుకుంటామని వివరించారు. సమావేశంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్‌కే చౌహాన్, డీజీఎం జి.నాగరాజు, కర్నూలు ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు

క్లుప్తంగా

కల్లుబావిలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న టూటౌన్ పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణంలోని కల్లుబావిలో అర్ధ రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కల్లుబావికి చెందిన రామాంజనేయులు, సుపుత్రమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి సోమవారం ఉప్పరహాల్ గ్రామానికి పని నిమిత్తం వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగలగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని 4 తులాల బంగారం, 36 తులాల వెండి, రూ.15 వేల నగదును మూటగట్టుకుని ఉడాయించారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్న దృశ్యాన్ని చూసిన స్థానికులు బాధితుడికి సమాచారం అందించారు. వారు ఇంటికి చేరుకుని చోరీ జరిగిందని నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం



తీవ్రంగా గాయపడి మృతి చెందిన శేఖర్‌రెడ్డి

వెలుగోడు: ఆత్మకూరు–నంద్యాల ప్రధాన రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు దుర్మరణం చెందారు. స్థానికుల కథనం మేరకు మోతుకూరు గ్రామానికి చెందిన రైతు పుల్లారెడ్డి గారి శేఖర్‌రెడ్డి(57) సొంత పనుల నిమిత్తం తన ఎక్సెల్ వాహనంపై వెలుగోడుకు వచ్చాడు. మధ్యాహ్నం తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో నంద్యాల నుంచి గడ్డి మొక్కలు తీసుకొస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



భోజన నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న ఆర్‌జేడీ

పాణ్యం: మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని విద్యాశాఖ కడప ప్రాంతీయ సంచాలకులు శామ్యూల్ హెచ్చరించారు. నంద్యాల జిల్లా పాణ్యం కేజీబీవీని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. సాంబారుకు, రసానికి తేడా లేకపోవడంతో వంట నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీరకాయ కర్రీ కొంచెమే ఉండటంతో ఇంత మంది విద్యార్థినులకు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలను సహించేది లేదని, బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల కిట్లపై అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ఎత్తయిన బోదెలతో అధిక దిగుబడులు

- బిందు సేద్యమైతే ఉల్లి సాగుకు మరింత మేలు
- నీరు ఆదా.. దిగుబడి ఎక్కువ



ఎత్తైన బోదెలు ఏర్పాటు చేసుకొని ఉల్లి సాగు చేసిన దృశ్యం (ఇన్‌సెట్) రాజాకృష్ణారెడ్డి, అదనపు పీడీ, ఏపీఎంఐపీ, కర్నూలు

కర్నూలు (అగ్రికల్చర్): ఎత్తైన బోదెలపై బిందు సేద్యం ద్వారా ఉల్లి సాగు రైతులకు బాగా కలిసి వస్తుంది. ఉల్లి సాగు చేసే రైతులు ఎత్తైన బోదెలు ఏర్పాటు చేసుకుని సూక్ష్మ బిందుసేద్యాన్ని పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. ఎత్తైన బోదెల ఏర్పాటు, డ్రిప్ సదుపాయం వల్ల కలిగే ఉపయోగాల గురించి ఏపీఎంఐపీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రాజాకృష్ణారెడ్డి వివరించారు. ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

బోదెల ఆకారం..

బోదెలు తయారు చేసుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నల్ల రేగడి నేలలో బోదెలను చదును (ప్లాట్)గా చేసుకోవాలి. ఎర్ర నేలలు, తువ్వ నేలల్లో బోదెలను అర్ధచంద్రాకారంలో అంటే రోడ్లపై వేస్తున్న స్పీడ్ బ్రేకర్ల తరహాలో వేసుకోవాలి. నేలను బట్టి బోదెలను ఈ విధంగా వేసుకోవాలి. బోదెలు భూమి లెవెల్ నుంచి 3 నుంచి 5 ఇంచుల ఎత్తు వరకు వేసుకోవచ్చు. బోదెల వెడల్పు 90 నుంచి 100 సెంటీ మీటర్లు ఉండాలి. బోదెకు, బోదెకు మధ్య దూరం 20 నుంచి 30 సెంటీమీటర్లు ఉండాలి. దీని వల్ల ఎక్కువైన బోదెల మధ్యకు చేరుతుంది. రైతులు నడవడానికి, అంతర్‌కృషికి వీలుగా ఉంటుంది.

పైపుల ఏర్పాటు

బోదెల పద్ధతిలో ఉల్లి సాగులో బిందుసేద్యానికి అవసరమైన లాటరల్ పైపుల మధ్య దూరం 120 సెం.మీ ఉండాలి. ఎకరాకు 3,300 మీటర్ల లాటరల్ పైపులు అవసరమవుతాయి. లాటరల్ పైపుల వ్యాసం 16 మీ.మీ ఉండాలి. డ్రిప్ నీటి విడుదల పరిమాణం గంటకు నాలుగు లీటర్లు ఉండాలి.

ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న మండలాలు

ఎత్తైన బోదెలపై బిందు సేద్యం ద్వారా ఉల్లి సాగు బాగా పుంజుకుంటోంది. ఖరీఫ్‌లో ఈ పద్ధతికి తగిన గుర్తింపు రాగా, రబీలో మరింత విస్తరిస్తోంది. జోన్, ప్యాపిలి, కృష్ణగిరి, గోనెగండ్ల, సీ.బెళగల్, నందవరం మండలాల్లో ఎక్కువగా ఈ పద్ధతిని రైతులు అనుసరిస్తూ గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నారు.

మొక్కల సంఖ్య ఎక్కువే..

బోదెలపై డ్రిప్ ద్వారా ఉల్లి సాగులో మొక్కల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది. మొక్కల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల దిగుబడులు కూడా ఎక్కువగానే ఉంటుంది. మామూలు పద్ధతి ఉల్లిసాగులో ఎకరాకు 1.80 లక్షల మొక్కలు వస్తాయి. బోదెల పద్ధతిలో అయితే ఎకరాకు 2.25 లక్షల మొక్కలు వస్తాయి. దిగుబడులే ఆశాజనకంగా ఉంటాయి. పాతపద్ధతి ద్వారా, నీటి పారుదల కింద ఎకరాకు 8–10 టన్నుల దిగుబడి వస్తుంది. బోదెలపైసాగు చేయడం వల్ల ఎకరాకు 14 నుంచి 16 టన్నులు వస్తుంది. నికరాదాయం కూడా ఎక్కువగానే ఉంది.

ఉపయోగాలు

ఎత్తైన బోదెలపై బిందు సేద్యంలో ఉల్లి సాగు చేసినచో నీటి ఆదాతో పాటు ఒక ఎకరంలో ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటవచ్చు. బోదెలపై నీరు నిలిచే అవకాశం ఉండనందున చీడ పీడలు సమస్యలు తక్కువగా ఉంటాయి. భూమిలో గడ్డలకు గాలి బాగా ప్రసరించడంవల్ల నీరు,ఎరువులు అవసరమైన మోతాదులో అందించడం వల్ల నాణ్యమైన పెద్దగడ్డలు వస్తాయి. అంతేగాక 40–50 శాతం అధికంగా దిగుబడి వస్తుంది. ఈ విధానాన్ని దేవరబండ, గోసానిపల్లి, కొచ్చెరువు, చనుగొండ్ల, పందిర్లపల్లి గ్రామాల్లో రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ విధానాన్ని అన్ని మండలాలలకు విస్తరింపజేస్తాం. బోదెలపై నీరు నిల్వ ఉండక పోవడం వల్ల నీరు కుళ్లు, గడ్డ కుళ్లు వంటి తెగుళ్ల తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.వర్షాకాలంలోనూ అధిక దిగుబడులు పొదవచ్చు. ఈ విధానంలో సాగు చేసినపంటలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. రబీలో ఉల్లి సాగు చేసే రైతులు ఎత్తైన బోదెలను ఏర్పాటు చేసుకొని డ్రిప్ కల్పించుకోవాలి.

గర్భిణులకు స్కానింగ్ కష్టాలు



పేర్లు నమోదు చేయించుకుంటున్న గర్భిణులు



స్కానింగ్ కోసం బారులుతీరిన గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో స్కానింగ్ పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి పెద్ద సంఖ్య గర్భిణులు తరలివచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు,కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల నిమిత్తం గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. అకితే అక్కడ కనీస సౌకర్యాలు లేక నానా అవస్థలు పడ్డారు. సరిపడా కుర్చీలు లేకపోవడంతో గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. మొత్తం 566 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి తెలిపారు.

బతుకుదెరువుకెళ్లి.. అనంతలోకాలకు

- పీలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోసిగి కూలీల మృత్యువాత



మృతి చెందిన అంజినమ్మ, లక్ష్మి (ఫైల్)

కోసిగి: పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లిన మండల కేంద్రానికి చెందిన ఇద్దరు కూలీలు చిత్తూరు జిల్లా పీలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతలోకాలకు చేరారు. మరో ఆరుగురు గాయాలపాలయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కోసిగి రామక్కమ్మ కాలనీకి చెందిన బుల్లి అంజినమ్మ(40), భర్త చిన్న నరసింహులు, కుమార్తె మల్లిక, నాగన్న గేరికి చెందిన కౌతాళం ఉసేని కుమార్తె కౌతాళం లక్ష్మి(16)తో పాటు కోసిగి, పెద్దతుంబళం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు రెండు నెలల క్రితం చిత్తూరు జిల్లాకు వలస వెళ్లారు. అక్కడ రోజువారీగా సిమెంట్, కాంక్రీట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం పీలేరు సమీపంలో పనుల ముగించుకుని నివాసం ఉండే ప్రాంతానికి ఆటోలో 8 మందితో కలిసి తిరిగి పయనమయ్యారు. కొంత దూరం వెళ్లగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ వాహనం వీరి ఆటోను వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఆటో బోల్తాపడగా అంజినమ్మ, లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. అంజినమ్మ కుమార్తె మల్లికకు కాలు పోయింది. కోసిగికి చెందిన మరో ఇద్దరు, పెద్ద తుంబళానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తిరుపతి ఆస్పత్రికి తరలించారు. బతుకుదెరువు కోసం వెళ్లి మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెంచు యువకుడిపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడిన నాగన్న

మహానంది: మహానందిలోని ఈశ్వర్‌నగర్ చెంచుకాలనీకి చెందిన నాగన్న(నాగులు)పై చిరుత దాడి చేసింది. మంగళవారం బహిర్భూమికి వెళ్లిన అతనిపై చిరుత దాడి చేయడంతో వెంటనే కేకలు వేస్తూ పరిగెత్తాడు. అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. పిరుదులు, వీపుపై చిరుత రక్కడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాదాపు వారం రోజులుగా చిరుత మహానంది ప్రాంత ప్రజలను హడలెత్తిస్తున్నా అటవీ అధికారుల్లో చలనం కరువైంది.

మధ్యాహ్న భోజనం తనిఖీ



బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

చాగలమర్రి: చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పీఎం పోషణ్ గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని మండల త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంఈఓ అనురాధ, తహసీల్దారు రమణమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వంటకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం కోటయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పులిహోర, టమాట పచ్చడి లేదా దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ వడ్డించాల్సి ఉండగా అన్నీ సక్రమంగానే అందించారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల్లో వంట ఏజెన్సీలను స్థానిక టీడీపీ నాయకులు దక్కించుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1,250 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 530 మంది విద్యార్థులు ఉండటంతో ఈ పాఠశాలల ఏజెన్సీలను దక్కించుకునేందుకు పలువురు టీడీపీ నాయకులు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.



కుటుంబ సమేతంగా!

ఆలూరు: కాడి కట్టేందుకు ఎద్దులు లేవు. ఎద్దులు కొనేందుకు డబ్బు లేవు. చేసేదేమీ లేక ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామానికి కురుబ సోమన్నకు కూతురు జ్యోతి, అల్లుడు రంగన్నే కాడెద్దులయ్యారు. కొర్ర సాగు చేపట్టారు. ఒంటి కొయ్య నాగలిని వారే భుజానకెత్తుకుని లాగుతూ మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం లోగా మూడెకరాల కంది పంటలో కొర్ర విత్తనం వేసి ఔరా అనిపించారు.

లోకాయుక్త, ఉపలోకాయుక్తలను కలసిన కలెక్టర్



లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డికి బొకే అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్‌పి.లక్ష్మణ్‌రెడ్డి, ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజనీలను కలెక్టర్ పి.రంజిత్‌బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మంగళవారం వారిని లోకాయుక్త కార్యాలయానికి వెళ్లి కలిసి పూలబొకేలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణానదిలో చేపలవేట నిషేధం

కొత్తపల్లి: రెండునెలల పాటు కృష్ణానదిలో చేపలవేట నిషేధమని, మత్స్యకారులు ఎవరూ నదిలో వేటకు వెళ్లకూడదని మత్స్య శాఖ అధికారి భరత్‌లాల్ నాయక్ మంగళవారం తెలిపారు. ఈనెల 1 నుంచి ఆగష్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు వర్షకాలం కావడం, ఈ సమయంలో చేపలు సంతానోత్పత్తి చేయడంతో చేపల వేట నిషేధమని చెప్పా రు.శ్రీశైలం బ్యాక్ వాటర్, సంగమేశ్వరం, కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘి స్తేమత్స్యకారుల లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

మాన్యం భూముల వేలంలో 'దేవుడి పాట'



రుద్రవరంలో కౌలు వేలం వేస్తున్న అధికారులు



అనధికారికంగా వేలం వేస్తున్న టీడీపీ నాయకుడు

- అధికారికంగా రూ.3,31,500లకే పరిమితం
- అనధికారికంగా రెండో సారి రూ.7.09 లక్షలు
- దేవాలయాల అభివృద్ధి పేరుతో టీడీపీ నేతల ఇష్టారాజ్యం

రుద్రవరం: అధికార పార్టీ నేతలు చెప్పిందే వేదం అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఖజానాకు గండి పడేలా వ్యవహరిస్తున్నా అధికారులు ఉత్సవ విగ్రహంలా మారిపోతున్నారు. మండల కేంద్రం రుద్రవరంలో మంగళవారం జరిగిన ఆలయ భూముల కౌలు వేలం ఇందుకు నిదర్శనం. స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయంలో మాన్యం భూములకు దేవదాయ శాఖ ఈఓ సాయి జయచంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్ కార్తిక్ కౌలు వేలం నిర్వహించారు. భాస్కర, నందీశ్వర, ఆంజనేయ, దొర్విన్‌రసింహా స్వామి ఆలయాలకు సంబంధించిన 36.79 ఎకరాలకు కౌలు వేలం ప్రారంభించారు. అయితే గ్రామ పెద్దలు సిండికేట్‌గా మారి పది మందితోనే వేలం సాగించారు. గతేడాది వేలం పాటల్లో దాదాపు రూ.2.50 లక్షలు రాగా ఈ ఏడాది రూ.3,31,500కు పెంచి పాడారు. అక్కడికి అధికారికంగా కౌలు వేలాన్ని ముగించారు. వెంటనే టీడీపీ నాయకులు అనధికారికంగా రెండో సారి కౌలు వేలం నిర్వ హించారు. ఆ వేలం రైతుల మధ్య పోటాపోటీగా సాగింది. ఈ వేలంలో రూ.7.09 లక్షల ఆదాయం వచ్చింది. అధికారికంగా నిర్వహించిన వేలానికి అదనంగా రూ.3,77,500 ఆదాయం వచ్చింది. అయితే అదనంగా వచ్చిన ఆదాయంతో ఆలయాల అభివృద్ధికి వినియోగించాలని గ్రామస్తులు సూచించారు. దాదా పు 25 ఎకరాలు మాన్యం ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభం కూలిందని ప్రత్యామ్నయంగా వెదురుకర్రను ధ్వజ స్తభంగా నిలబెట్టామని వచ్చిన ఆదాయంతో కొత్త ధ్వజ స్తంభం ప్రతిష్ఠించాలని కోరారు. అయితే అధికారుల సాక్షిగా ఆలయ భూములకు అనధికారికంగా వేలం నిర్వహించడంతో సర్వత్రా విమర్శలు వెల్లుతున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎలా వ్యవహరిస్తారో వేచిచూడాల్సిందే.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



తుగ్గలి: మండల పరిధిలోని రాతన చెరువులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చెరువు నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉండి, నీలం గీతల చొక్కా, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈత రాక నీటిలో పడి మృతిచెందాడా లేక ఆత్మహత్యా, మరే ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున తన సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు పాఠశాలలు.. పది మంది విద్యార్థులు



తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: పాఠశాలలు తెరిచి నెల రోజులు పూర్తవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, నాణ్యమైన చదువుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి అవగాహన కల్పించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని ఎర్రగుడిలో ప్రాథమిక మెయిన్ పాఠశాల, బీసీ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడే తరగతి గదులు ప్రస్తుతం బోసిపోతున్నాయి. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం అయినా విద్యార్థుల సంఖ్య పెరగకపోవడం శోచనీయం. గత విద్యా సంవత్సరంలో మూడు నుంచి ఐదవ తరగతి వరకు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు మెయిన్ పాఠశాలలో ఐదుగురు, బీసీ పాఠశాలలో ఐదుగురు చొప్పున విద్యార్థులున్నారు. ఉన్నత పాఠశాలలో మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులు ఏడుగురు మాత్రమే ఉన్నారు. రెండు ప్రాథమిక పాఠశాలల్లో కొన్ని సందర్భాల్లో విద్యార్థులు గైర్హాజరైతే ఒకరిద్దరు ఉంటున్న సందర్భాలు ఉన్నాయి.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన బాలుడు ఉసేని

ఆదోని అర్బన్: మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన ఈరమ్మ, బసవరాజ్ దంపతుల ఐదేళ్ల కుమారుడు ఉసేని విద్యుదాఘాతానికి గురై తీవ్రగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రోజూ మాదిరిగా ఉసేని మంగళవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. బాత్‌రూమ్ వస్తుందని మరో బాలుడితో కలిసి బయటకు వెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లారు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న తీగను ఉసేని పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. అదృష్టవశాత్తూ వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పింది. అస్వస్థతకు గురైన బాలుడిని వెంటనే ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కాగా అంగన్‌వాడీ పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

- టీడీపీ నాయకుడి ఫోన్ కాల్‌తో సెల్‌ఫోన్, బైకులను వదిలేసిన పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో త్రీటౌన్ పోలీసులు ఈనెల 7న 15 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. పేకాట రాయుళ్లలో 12 మంది టీడీపీకి చెందిన వారు ఉండటంతో విషయాన్ని పోలీసులు బయటకు పొక్కకుండా దాచి పెట్టినట్లు ఆరోపణలున్నాయి. పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్ద నుంచి రూ.90 వేల నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఓ టీడీపీ నాయకుడు ఫోన్ చేయడంతో నిందితుల సెల్‌ఫోన్‌లు, బైకులు వదిలేసినట్లు సమాచారం. ఇదే విషయంపై త్రీటౌన్ సీఐ నరసింహరాజును ఆరా తీయగా సెల్‌ఫోన్లలో ఎలాంటి డేటా లభ్యం కాకకపోవడంతో స్వాధీనం చేసుకోలేదని, ఘటనా స్థలంలో వాహనాలేవీ కనిపించలేదని వివరణ ఇవ్వడం గమనార్హం.



కష్టాన్ని పంచుకోవడమే 'సంతోషం'

ఎవరు గొప్ప. ఆధునిక ప్రపంచంలో బంధాల మధ్య కూడా పోటీ నెలకొంది. నేను కూడా నీతో పాటు సంపాదిస్తున్నా.. నువ్వెందులో గొప్ప అనే భావన అధిక శాతం దంపతుల్లో కనిపిస్తోంది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతుండటంతో భార్యాభర్తల మధ్య సఖ్యత కొరవడి చీటికీ మాటికీ గొడవలు సర్వసాధారణమయ్యాయి. ఇదిగో ఇలాంటి దృశ్యాలు చూసినప్పుడు.. కష్టమంటే భర్త మాత్రమే కాదని, తామూ ఆయనలో సగమని చాటడం ముచ్చటేస్తుంది. తినేందుకు తిండిలేకపోయినా.. చేసేందుకు పని దొరక్కపోయినా.. కష్టాన్ని పంచుకొని ముందుకు సాగడమే అసలైన సంతోషం. మంగళవారం నగరంలోని సి.క్యాంప్ సెంటర్‌లో కుమారుడిని భర్త నిద్రపుచ్చుతుండగా.. భార్య బతుకు బండిని లాగుతున్న దృశ్యం ఆ ఇద్దరి మధ్య అనురాగానికి నిర్వచనంలా నిలిచింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు